# ప్రజాశక్తి

సోమవారం 27 నవంబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు


# మరో అవినీతి బాగోతం!

- సిరిల్ పాల్ వ్యవహారం మరవక ముందే మరో కుంభకోణం
- కార్పొరేషన్‌లో ఉద్యోగుల పిఎఫ్ నిధుల స్వాహా
- కాంట్రాక్టర్ల సొమ్ము దారిమళ్లినా కొరవడిన పరిశీలన
- సొమ్ము రికవరీపై అధికారుల మీనమేషాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎకౌంట్స్ విభాగంలో అవినీతి అక్రమాలు కొనసాగుతున్నాయి. గతేడాది అక్టోబరులో కాంట్రాక్టర్లకు సంబంధించిన రూ.47.09 లక్షలను దారిమళ్లించి స్వాహా చేసిన ఎకౌంటెంట్ సిరిల్ పాల్‌ను గతేడాది నవంబరు 3న కమిషనర్ చేకూరి కీర్తి సస్పెండ్ చేశారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన సొమ్మును బ్యాంకు నుంచి వేరే ఖాతాలకు రూ.47 లక్షలు మళ్లించారు. అయినా ఇంత వరకు ఒక్కరూపాయి కూడా రికవరి చేయలేదు. సిరిల్‌పాల్ సైబర్, ఆర్థికనేరానికి పాల్పడినా సంబంధం లేని వ్యక్తుల ఖాతాలకు నిధులు మళ్లించినా ఇంత వరకు ఈ నిధులను రికవరి చేయలేకపోయారు. సిరిల్‌పాల్‌ను పోలీసులు ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. 15 రోజుల తరువాత ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు.

తాజాగా శాశ్వత ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పిఎఫ్., ఇపిఎఫ్ ఖాతాల నుంచి తీసుకునే రుణాల్లో కొంత సొమ్మును కార్పొరేషన్‌లోని ఎకౌంట్స్ విభాగంలోని కొంత మంది ఉద్యోగులు స్వాహా చేసినట్టు తెలిసింది. దాదాపు 90 మంది ఉద్యోగులకు చెందిన రూ.25 లక్షలు స్వాహా చేసినట్టు కార్పొరేషన్‌లో కొంతమంది అధికారులకు తెలిసినా వారు మౌనం వహించారు. శాశ్వత ఉద్యోగులు పిఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే కార్పొరేషన్ కమిషనర్ అనుమతిస్తారు. అయితే వారు దరఖాస్తు చేసుకున్న సొమ్ముకు అదనంగా కొంత మొత్తం జమచేసి వాస్తవంగా దరఖాస్తు చేసిన సొమ్మును ఉద్యోగి ఖాతాకు, మిగతా సొమ్ము ఇతర ఖాతాలకు మళ్లించి స్వాహా చేస్తున్నారు. ఉద్యోగులకు అనుమానం రాకుండా ఈ తతంగం నడుపుతున్నారు. అనధికారికంగా రుణం మంజూరు చేసినందుకు పర్సంటేజి తీసుకుంటూనే ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు.

కొంతమంది ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎక్సౌంట్స్ విభాగంలో పనిచేయడం వల్ల వీరు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారు. కమిషనర్ మంజూరు చేసిన రుణానికి, వాస్తవంగా ఉద్యోగి ఖాతా నుంచి రుణంగా డ్రా చేసిన మొత్తంకు భారీ వ్యత్యాసం ఉంటోంది. చాలామంది ఉద్యోగులు ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించి ఈ అంశంపై సిఎం వైఎస్ జగన్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇపిఎఫ్ రుణాల్లోనూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉండటం వల్ల వారిని ఎకౌంట్స్ సెక్షన్ ఉద్యోగులు రుణాల మంజూరులో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై

▶ 2లో

## ప్రధాని మోడీ రాకకు నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి

తిరుపతి వెంకన్న సాక్షిగా తొమ్మిదేళ్ల క్రితం ప్రధాన మంత్రి మోడీ ఇచ్చిన హామీలు నేటికీ అమలు జరగకుండా మళ్లీ అదే తిరుపతికి ఎలా వస్తున్నారని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు విమర్శించారు. తిరుపతి మోడీ రాకను నిరసిస్తూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ తదితర హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి వస్తున్న ప్రధాన మంత్రికి ముఖ్యమంత్రి స్వాగతం చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిన మోడీని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వంత పాడటం మానుకోవాలని హితలు పలికారు. ప్రశ్నిస్తానని వచ్చిన జనసేన బిజెపి కౌగిలిలో చేరిందని విమర్శించారు. ఇప్పటికైనా ఆ మూడు పార్టీలు బిజెపితో బంధం విడగొట్టుకోవాలని, లేకుంటే ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, పిఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సుబ్బారెడ్డి, నాయకులు ఎస్.ముత్యాలరావు, కె.బాబూరావు, డి.విజయబాబు, కె.మేరి, డి.యోహాన్, సాంబశివరావు, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## వాహనాల బదిలీ సులభతరం

8 లో

## రైతును ముంచుతున్న నిబంధనలు

**కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ**

**మద్దతు ధరకు పత్తి పంట మొత్తం కొనాలని డిమాండ్**

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి దిగుబడులు బాగా తగ్గాయని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం సిసిఐ కేంద్రాలను ప్రారంభించి రూ.7020 మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. క్వింటాళ్ రూ.7500 ధర పలికిన పత్తి ధర రైతుల చేతికి పంట రాగానే రూ.6 వేలకు పడిపోయిందని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం పంట కొనుగోలులో నిబంధనల పేరుతో రైతులను నట్టేట ముంచుతురన్నారు. గతంలో తేమ శాతం 12 వరకు అనుమతించగా ఇప్పుడు 8 శాతానికి తగ్గించిచారని, ప్రతి ఒక్క శాతం పెరుగుదలకు రూ.70.20 కోత విధిస్తున్నారని విమర్శించారు. తేమ 12 శాతానికి మించితే కొనుగోలు చేయటానికి సిసిఐ బయ్యర్లు నిరాకరిస్తున్నారన్నారు. ఎకరంలో పండిన పత్తి మొత్తాన్ని కొనకుండా 4 క్వింటాళ్ల వరకే పరిమితి విధించటం అన్యాయమన్నారు. 3 ఎకరాలు వేసిన రైతుకు 16 క్వింటాళ్ల దిగబడి వస్తే 12 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తే మిగిలిన 4 క్వింటాళ్లు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. కొనుగోలు చేసిన పంటకు డబ్బులను మూడ్రోజుల్లోగా రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ-క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా కౌలు రైతుల గుర్తింపు కార్డుల ఆధారంగా వారి పంట మొత్తాన్నీ కొనాలని కోరారు. రైతు సమస్యల పరిష్కారం కోసం సోమ, మంగళవారాల్లో విజయవాడలో జరిగే ధర్నాకు రైతులు, కౌలురైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

4,5 లో

నరసరావుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీనివాసరెడ్డి తదితరుల నివాళి

## రాజ్యాంగం నుండి స్ఫూర్తి పొందాలి

గుంటూరులో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి రాజకుమారి

## రోగి మృతి - వైద్యునిపై దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వ్యక్తి మృతి చెందాదంటూ ఆగ్రహానికి గురైన బంధువులు ఒ ప్రైవేటు ఆస్పత్రికి దాడి చేయగా వైద్యుడూ తీవ్రంగా గాయపడ్డాడు. సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం చోటుచేసుకున్న ఘటనపై మృతుని బంధువులు వివరాల ప్రకారం.. బెల్లంకొండ మండలం వన్నాయపాలేనికి చెందిన పత్తిపాటి ప్రసాద్ (44)కు గుండె నొప్పి రావటంతో కుటుంబ సభ్యులు సత్తెనపల్లి పట్టణంలోని ఒ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 1.44 గంటలకు ఆస్పత్రికి తీసుకురాగా గుండె వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మత్తు డాక్టర్ రెండు గంటల తర్వాత వచ్చి చికిత్స చేశారు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే ప్రసాద్ మృతి చెందాడు. దీంతో ఆగ్రహించిన మృతుని

▶ 2లో

ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు.. ప్రసాద్ మృతదేహం (ఇన్‌సెట్)

## రోగి మృతి - వైద్యునిపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

బంధువులు ఆస్పత్రిపై దాడిచేసి కంప్యూటర్లను ధ్వంసం చేశారు. మత్తు డాక్టర్‌పై దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. దాడి విషయం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. గాయపడిన డాక్టర్‌ను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతుని బంధువులు, డాక్టర్‌తో పట్టణ సిఐ ప్రభాకర్ చర్చిస్తున్నారు. ఇదిలా ఉండగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతి చెందాడని మృతుని భార్య నాగరాణి ఆరోపించారు. ఆస్పత్రిని సీజ్ చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. మతునికి భార్య నాగరాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుమార్తె గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## మరో అవినీతి బాగోతం!

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌లో ఒక అధికారి అంతర్గత విచారణ చేసి కమిషనర్‌కు నివేదిక ఇవ్వకుండా మిన్నకుండిపోయారని తెలిసింది.

**కాంట్రాక్టర్ల సొమ్ము రికవరీపై ప్రతిష్టంభన**

ఎకౌంటెంట్ సిరిల్‌పాల్ దారిమళ్లించి స్వాహా చేసిన తమ సొమ్ము రికవరిపై కమిషనర్ కూడా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు తరచూ మేయర్ కావటి మనోహర్ నాయుడ్ని కలిసి ఒత్తిడి చేస్తున్నారు. కమిషనర్‌ను కలిసినా ఇంతవరకు చర్యల్లేవు. కార్పొరేషన్ నుంచి రూ.47 లక్షలు కాంట్రాక్టర్లకు చెల్లించినట్టు చూపి వాటిని ఇతర ఖాతాల్లో జమయ్యేలా చేసిన సిరిల్ పాల్ ఆస్తుల జప్తు చేయలేదు. ఏ ఖాతాలో జమయ్యాయో ఆయా ఖాతాలను సీజ్ చేయలేదు. కేవలం పోలీసు కేసు పెట్టి చేతులు దులుపుకొన్నారని విమర్శలు వస్తున్నాయి.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి - విజయవాడ :** తాడేపల్లి సీతానగరంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం విజయవాడలోని హోటల్ శ్రీపాదలో జరిగింది. పదో తరగతి 1976-77 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 46 ఏళ్ల తర్వాత కలుసుకున్నామన్న ఆనందం పూర్వ విద్యార్థుల్లో కనిపించింది. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు చెరుకూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రకాశరావు, సురేంద్రబాబు, కామేశ్వరరావు, సుబ్బారావు, రామ్మూర్తి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ఆరిగ స్వామి, పర్యవేక్షకులు ప్రతాపరెడ్డి, పూర్వ విద్యార్థులు రమణ, ఓ.రమేష్, కనకరాజు, దాస్ పాల్గొన్నారు.

## టిడిపి-జనసేన ప్రచారం

**ప్రజాశక్తి-తెనాలిరూరల్ :** టిడిపి ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోపై భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్ర ఆదివారం నిర్వహించారు. స్థానిక 31వ వార్డు జెండా చెట్టు బజార్లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి అంశాను ప్రచారం చేశారు. అనంతరం జనసైనికులతో కలసి చర్చ వేదిక నిర్వహించారు.

## టిడిపి మినీ మేనిఫెస్టోపై ప్రచారం

**ప్రజాశక్తి - తుళ్లూరు :** స్థానిక ఎస్సీ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం జరిగింది. టిడిపి నాయకులు ఇంటిం టికీ తిరిగి టిడిపి అధికారంలోకి వస్తే ఒనగూడే ప్రయోజ నాలను వివరించారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, జె.దుర్గారావు, మహేష్, ఎ.నాగరాజు పాల్గొన్నారు.

# వైద్యరంగంలో మానవత్వం ఎక్కువ

### రాష్ట్రజ్యుడిషియల్ అకాడమి డైరెక్టర్ హరిహరనాథశర్మ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కోవిడ్ సమయంలో వైద్య రంగమే మానవత్వాన్ని చాటుకుందని రాష్ట్ర జ్యూడిషల్ అకాడమీ డైరెక్టర్ ఎ.హరిహరనాథశర్మ అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లోని సుశృత హాలులో ఆదివారం జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభ నిర్వహించగా సభకు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ అధ్యక్షత వహించారు. రాజ్యాంగ హక్కుపై హరిహరనాథశర్మ ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవజాతి ఉన్నంత వరకు వైద్య రంగం చేసిన సేవలను ఎన్నడూ మరువ లేమని అన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు వైద్య సేవలు అందించారని కొనియాడారు. వైద్య రంగంతో పాటు పారిశుధ్యం, పోలీసు వ్యవస్థ బాగా పని చేశాయని గుర్తు చేశారు. గ్రామాల్లో వైద్యులు పని చేయాలని రాజ్యాంగం చెబుతోందని, రాజ్యాంగ బద్ధమైన చట్టం ఎంతో ఉన్నతమైందని, రాజ్యాంగ నీతికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని చెప్పారు. రాజ్యాంగం పట్ల గౌరవం, నమ్మకంతో ముందుకెళ్తే విజయం సాధించడం చాలా తేలికైనా పని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన జీవించే హక్కు గుండెకాయ వంటిదని, ఆర్టికల్ 21లో ప్రతి ఒక్కరికి జీవించే హక్కు ప్రసాదించిందని నొక్కి చెప్పారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను భంగం కలిగించకూడదన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నాట్కో కో-ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్, డిఎంఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అడ్మిన్ అడిషనల్ ఎస్‌పి సుప్రజ, క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ బాలసుబ్రమణ్యం, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రమేష్ కృష్ణన్, రాఘవయ్య, బ్రహ్మానందం పాల్గొన్నారు.

# కాలాన్ని శాసించగల శక్తి కవులకే ఉంది

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

కాలాన్ని సైతం శాసించగల శక్తి కవులకే వుందని, కాలం కవుల చేతిలో మాత్రమే బందీగా వుంటుందని మాజీమంత్రి, జాషువా కళాపీఠం అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం బాపు రమణ బాలు కళాపీఠం, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'యశస్వీయ సప్తపదులు' పుస్తకావిష్కరణ, కవిమిత్రుల సంగమం-కవి సమ్మేళనం కార్యక్రమం జరిగింది. డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కాలాన్ని తన గుప్పిటలోకి తెచ్చుకుని వైద్యుడిగా, సాహితీవేత్తగా రెండు పాత్రల్నీ ఏకకాలంలో పోషిస్తున్న విశిష్టవ్యక్తి డాక్టర్ రమణ యశస్వి అని అన్నారు. లఘు కవితా ప్రక్రియల ఉద్యమకారుడు, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు 'సప్తపదులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో మినీ కవితా ప్రక్రియలపాత్ర కీలకమైందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు మాట్లాడుతూ నేడు తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు, పరిణామాలు వస్తున్నాయని, ఇవి చాలా అవసరం అన్నారు. సాహిత్యంలో మార్పు అనివార్యం అని, మంచి మార్పు సాహిత్యాన్ని పదికాలాలు సజీవంగా వుంచుతుందన్నారు. ప్రసిద్ధ కవి కోసూరి రవికుమార్ పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, సాహితీవేత్తలు డాక్టర్ పీ.వీ.సుబ్బారావు, వైహెచ్‌కె.మోహనరావు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. పుస్తక రచయిత డాక్టర్ రమణ యశస్వి నూతన కవితా ప్రక్రియ ఉద్దేశాన్ని తెలిపారు. అనంతరం బి.జనార్ధనరెడ్డి నిర్వహించిన కవి సమ్మేళనంలో మూడు జిల్లాలకు చెందిన కవులు తమ కవితల్ని వినిపించారు. చిలకలూరిపేటకు చెందిన పివి రమణకుమార్ చదివిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసి నగదు బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. విజేతను అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ సత్కరించారు. కార్యక్రమాన్ని సయ్యద్ జానీబాషా, బండికల్లు జమదగ్ని నిర్వహించారు.

## అనారోగ్య సమస్యలకు హీలి మిషన్ ద్వారా పరిష్కారం

ప్రజాశక్తి-తాడేపల్లి

హీలి మిషన్ ద్వారా రోగాలకు తగ్గించవచ్చని ప్రముఖ ఫ్రీక్వెన్సీ థెరపిస్ట్, హీలి ఎక్స్‌పర్ట్ డాక్టర్ రవినారాయణ (ఎమ్‌డి, హైదరాబాద్) చెప్పారు. ఈ మేరకు సుందరయ్య నగర్‌లోని మానసరోవరం పిరమిడ్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఈ వైద్య విధానంపై ఆరు మాసాలు ట్రైనింగ్ పూర్తి చేసి వచ్చినట్లు తెలిపారు. దేశంలో ఈ వైద్యాన్ని వేలాది మందికి అందించి పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేస్తున్నట్లు తెలిపారు. ఫ్రీక్వెన్సీ థెరపీ ఎనర్జీ ద్వారా అన్ని రకాల జబ్బులను తగ్గించుకోవచ్చన్నారు. నో డాక్టర్, నో మెడిసిన్, నో సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా ఒకేఒక్క ఫ్రీక్వెన్సీ ఎనర్జీ ద్వారా జర్మనీ టెక్నాలజీతో రూపొందించబడిన హీలి మిషన్ సమస్త రోగాలను తగ్గిస్తుందని అన్నారు. ఒక చిన్న డివైజ్ ద్వారా అన్ని రకాల శారీరక, మానసిక అనారోగ్యాలను తగ్గించుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం 62 దేశాల్లో ఆయా దేశాల ఎఫ్‌డిఎ అనుమతితో ఈ మిషన్ ద్వారా లక్షలాది మంది పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మానస సరోవరం నిర్వాహకులు కె.రామిరెడ్డి పాల్గొన్నారు.

# బహిరంగ విచారణకు సిద్ధం

### ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు కోవెలమూడి రవీంద్ర సవాల్

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అక్రమంగా ఓట్ల తొలగింపులో మద్దాలిగిరి హస్తం ఉందని తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర తెలిపారు. తాను ఆధారాలతో సహా మద్దాలి గిరి అక్రమాలు బయటపెడితే తమ మీద ఇవి ఫేక్ అంటూ పోలీసు కేసు పెట్టడాన్ని తాను నేను స్వాగతిస్తున్నానని, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని రవీంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు పశ్చిమ టిడిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఓట్ల తొలగింపు దొంగ 'మద్దాలి గిరి' అని బాహ్య ప్రపంచానికి తెలిసిపోయిందన్నారు. దీనితో షాక్ తిని 2 రోజులు కనపడకుండా, నిన్న అభద్రతా భావంతో ఎస్‌పికి ఫిర్యాదు చేశారని అన్నారు. తాను 35 ఏళ్లుగా టిడిపిలో ఉన్నానని, గిరి మాత్రం 2014లో టిడిపిలోకి వచ్చి 2019లో టిడిపి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి నమ్మకద్రోహం చేసి వైసిపిలోకి వెళ్లారని అన్నారు. ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని చేసిన దందాలు వాస్తవం కాదా? వ్యాపారవేత్తల దగ్గర నుండి బిల్డింగ్ యజమానుల వరకు డబ్బుల కోసం వేధించిన విషయం వాస్తవం కాదా ? అని

ప్రశ్నించారు. తాను బయటపెట్టిన స్క్రీన్ షాట్లు అవాస్తవం అని తేలితే రాజకీయాల నుండి వైదొలుగుతానని, నిజమైతే ఆయన వైదొలుగుతారా? అని సవాల్ విసిరారు.

**రేపు బిసిల సమస్యలపై రౌండ్‌టేబుల్ భేటి**

బిసిలు ఎదుర్కొంటున్న సమస్యలపై గుంటూరులో ఈ నెల 28వ తేదీన ఎన్ జి ఓ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు బిసి అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ) పిలుపునిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో బిసి నేతలతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి యనమల రామకష్ణుడు ముఖ్య అతిధిగా హాజరవ్వనున్నారు. తొలుత రాష్ట్రంలో బిసిల మీద జరుగుతున్న దాడులను వివరిస్తూ టీడీపీ ప్రచురించిన బుక్ లెట్‌ను విడుదల చేశారు.

## మైనార్టీలకు అండగా ఉంటాం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మైనార్టీలకు వైసిపి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. పట్టాభిపురంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ షాదీఖానా వెనుక ఉన్న స్థలంలో ఇస్లామిక్ కౌన్సిల్ హాల్, లైబ్రరీ నిర్మాణంలో భాగంగా మొదటి శ్లాబు పనులకు గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి, ముస్లిమ్ మత పెద్దలతో కలిసి అప్పిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మరెక్కడా లేని రీతిలో ముస్లిం మైనార్టీలకు ప్రత్యేకంగా ఇస్లామిక్ కౌన్సిల్ హాల్, లైబ్రరీతో పాటు వసతి గదుల నిర్మాణానికి గుంటూరు వేదిక కావడం మరో ప్రత్యేకమైన అంశంగా ఆయన ప్రస్తావించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో ముస్లిం మైనార్టీల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసే ప్రక్రియలో ముస్లింలే క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, ముస్లిం మైనార్టీల జీవన ప్రమాణాల మెరుగుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. వారి జీవితాలు బాగుపడాలన్న తన కలను సీఎం జగన్ సాకారం చేశారన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

## 'అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టండి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట సోషల్ మీడియా వేదికగా ప్రతీ ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ముఖ్యంగా యువత సోషల్ మీడియా ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక రామిరెడ్డి పేటలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ (సన్నిధి)లో ఆదివారం సోషల్ మీడియా వారియర్స్ తో ఆత్మీయ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోషల్ మీడియా వారియర్స్ ఎప్పటికప్పుడు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా వారు చేసే అబద్దపు ప్రచారాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివ రించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమాన్ని సోషల్ మీడియా ద్వారా విరివిగా ప్రచారం చేయాలన్నారు. గ్రామ స్థాయిలో సోషల్ మీడియా ద్వారా గ్రామంలో జరిగిన, జరుగుతున్న అభివద్ధి పై సోషల్ మీడియా ద్వారా చర్చకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను నిత్యం సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అనవసర ఆరోపణలను ఖండించాలని, వారి ప్రచారం అబద్ధం అని చెప్పడానికి కూడా సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని సూచించారు. మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి-తెనాలి

అపార్ట్మెంట్లో రహస్యంగా జరుగుతున్న పేకాట శిబిరంపై పట్టణ పోలీసులు దాడి చేశారు. పక్క సమాచారంతో అక్కడికి వెళ్లిన పట్టణ ఒన్ టౌన్ పోలీస్ బృందం రెడ్ హ్యాండెడ్ గా ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుంది. వారి నుంచి రూ.36,860 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## నరసరావుపేట కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు విస్తరించిన క్రికెట్ బుకీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్రంలో క్రికెట్ బుకీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిడిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నేడు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిడిఎం సీనియర్ నాయకులు వై. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ప్రకాష్ నగర్ లోని ఎన్జీవోహోం లో ధర్నా కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నరసరావుపేట కేంద్రంగా క్రికెట్ బుకీలు పెద్ద ఎత్తున యువతను క్రికెట్ బెట్టింగ్ లోకి లాగుతూ మోసం చేస్తూ అప్పులపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రికెట్ బుకీలలో రూ 50 లక్షల మేర అప్పుల పాలై రొంపిచర్ల మండలం అలవాల గ్రామానికి చెందిన గంగిరెడ్డి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి క్రికెట్ బుకీ లపై చర్యలు తీసుకొని వారి ఆస్తులు స్వాధీనం చేసు కోవాలని, సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని, బెట్టింగ్‌లలో ప్రాణాలు కోల్పోయిన నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం పిడిఎం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, నాయకులు ఎన్.రామారావు, ఎంఐఎం నాయకులు షేక్ ధరియ వలి, ఎబిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు అంజమ్మ, ఎంఆర్పిఎస్ నాయకులు ప్రసన్నకుమార్, సిపిఐ జిల్లా నాయకులు గఫూర్ పాల్గొన్నారు.

## మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారంతో ఆదివారం ఉదయం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలోని బెల్ట్ షాపులో సోదాలు నిర్వహించారు. ఇంటి లోపల బీరువాలో 11 క్వార్టర్ సీసాలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని బెల్ట్ షాప్ నిర్వాహకురాలు తన షాపు నుండి చాకచక్యంగా తప్పించుకుంది. అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, నిర్వాహకురాలపై కేసు నమోదు చేసినట్లు తాడేపల్లి స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తెలిపారు. చిల్లర కొట్టు వ్యాపారం చాటున, బెల్ట్ షాపు నిర్వహిస్తుందని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఇంటి చుట్టూ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లతో ఆ ప్రాంతమంతా నిండిపోయి చిందర వందరగా కనిపిస్తున్నాయి. సాయంత్రమైతే బెల్టు షాపు ఎదురుగా రోడ్డుపైనే బహిరంగంగా మందుబాబుల హడావుడి కనిపిస్తుందని స్థానికులు వాపోతున్నారు.

గుండిమెడలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

## కానిస్టేబుళ్ల నియామకాల్లో అక్రమాలు

### నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక జాషువా కళా ప్రాంగణం ఆవరణలో ఆదివారం నిరుద్యోగ సమావేశం నిర్వహించారు.పోలీస్ కానిస్టేబుళ్ల నియామకాలలో జరుగుతున్న అక్రమాలపై న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కుమార్ పిలుపు మేరకు ఈ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వినుకొండ నియోజకవర్గ నిరుద్యోగ సంఘం నాయకులు ఎం. ప్రభాకర్, మాట్లాడుతూ పోలీసుల నియామకంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కావడం లేదని, జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ కానిస్టేబుల్ కు రిజర్వేషన్ రోస్టర్ రిజిస్టర్ కూడా లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కోసం ఇచ్చే ఏ నోటిఫికేషన్ లో కూడా కేటగిరి ప్రకారం ఎస్సీ ఎస్టీ, బీసీ, మహిళ ప్రత్యేకంగా చూపించడం జరుగుతుంది కానీ పోలీస్ శాఖ నోటిపై పోస్టులో ఎస్సీ, ఎస్టీ బీసీ అండ్ ఉమెన్ వర్గానికి చెందిన పోస్టుల వివరాలు పేపర్ ప్రకటన ఇవ్వడం లేదని అన్నారు. దీనివలన అన్ని వర్గాలకు చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మహిళా నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారని అన్నారు. అన్యాయం జరిగి, నిరుద్యోగుల వయసు దాటిపోయి చాలామంది శాశ్వత నిరుద్యోగులుగా మారే పరిస్థితి ఉందని అన్నారు. తమపై దయతో జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఉన్న పోలీసు నియామక ప్రక్రియ రికార్డులను, రిజర్వేషన్ రిజిస్టర్ పరిశీలించి భర్తీ కానీ వాటికి బ్యాక్ లాగ్ స్పెషల్ నోటిఫికేషన్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో డి నాగరాజు, కె.సిద్దయ్య, ఎస్కే అనీఫ్ డి జాన్ బాబు పి చంటిబాబు, ఎ.ప్రభాకర్ ,ఎస్. లక్ష్మణరావు, పి. శ్యాంప్రసాద్ పాల్గొని ప్రసంగించారు.

## ముస్లిముల సమస్యల పరిష్కారిస్తాం

### టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నశీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ముస్లింల సమస్యల పరిష్కరిస్తామని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి మహ్మద్ నశీర్ తెలిపారు. టిడిపి తోనే మైనార్టీలకు భరోసా ఉంటుందన్నారు. టిడిపి జిల్లా పార్టీ కార్యాలయం లో జరిగిన ఉమ్మడి జిల్లా ముస్లిం నాయకుల అవగాహన సదస్సులో నశీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మైనార్టీలందరూ వారి ఎదుర్కొన్న సమస్యల గురించి తెలుసుకుని రాబోయే రోజుల్లో వాటి పరిష్కారం కోసం తెలుగుదేశం కృషి చేస్తుందని చెప్పారు. జిల్లాల వారీగా ముస్లిం లతో సమావేశాలు నిర్వహించి వారి నుండి అభిప్రాయాలు తీసుకుని టిడిపి ప్రభుత్వం రాగానే ఒక కార్యచరణ రూపొందిస్తా మన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందించాల్సిన రుణాలను వైసిపి ప్రభుత్వం నిలిపివేసిందని, ఆడబిడ్డ పెళ్లి కోసం ఇచ్చే దుల్హన్ పథకం అమలు ఆంక్షలు పెట్టారని అన్నారు. హజ్ హౌస్ నిర్మా ణాలు , ఇమామ్ అ మౌజాన్ లకు వేతనాలు, రంజాన్ తోఫా, రుణాలు అందించి వారి అభ్యున్నతికి చంద్రబాబు కృషి చేశారని అన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మైనార్టీలకు వైసిపి రద్దు చేసిన పథకాలన్ని పున రుద్ధరించడానికి కృషి చేసామని చెప్పారు.

## ప్రాచీన సాహిత్యంపై అధ్యయనం అవసరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నేటి తరం సాహిత్య కారులు ప్రాచిన సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ ప్రముఖ కవి, విమర్శకులు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అన్నమయ్య గ్రంథాలయంలో నిర్వహించిన మంచిపుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. 'తాపీ ధర్మారావు జీవితం' రచనలు పుస్త కాన్ని శివశంకర్ ఆవి ష్కరించారు. పులుపుల వెంకట శివయ్య గేయాలు, వ్యాసాలు' పుస్తకాన్ని అరసం నాయకులు ఓబులేసు ఆవిష్కరించారు. శివశంకర్ మాట్లాడుతూ ప్రాచీన ఆధునిక సాహిత్యాలకు వారధి తాపీ ధర్మారావు అన్నారు. నేటి విశ్వవిద్యాలయాలలో పరిశోధనా పద్ధతులు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓబులేసు మాట్లాడుతూ నేటి సమాజం రాజకీయ సాంఘిక రంగాలలో అనేక రుగ్మతలకు లోనైందని అన్నారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్త కాలను సమీ క్షిస్తూ ఉద్యమ సంస్థగా అరసం ఆంధ్రప్రదేశ్ శాఖ విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోందని అభినందించారు. సభకు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా ఈ తరం కోసం వచన కవిత, కుందుర్తి కవిత, తిలక్ కవిత సంపు టాలను అరసం రాష్ట్ర కారదర్శి కె. శరత్చంద్ర జ్యోతిశ్రీ ఆవిష్క రించారు. అనంతరం అరసం డిజిటల్ ఛానల్‌ను ఓబులేసు ఆవిష్కరించారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లా అరసం కార్యవర్గాన్ని వల్లూరు శివప్రసాద్ ప్రకటించారు.గౌరవాధ్యక్షులుగా కె.రామకృష్ణారెడ్డి, అధ్యక్షులుగా సిహెచ్ సింగా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.స్వర్ణలత, జి.సీతారామయ్య, కె.బెనహర్ ప్రధాన కార్యదర్శిగా కె. రవికుమార్, కార్యదర్శులుగా గంగోత్రి సాయి, బుల్లా రవి, కార్యవర్గ సభ్యులుగా కె.శివరామిరెడ్డి, ఎంవిఎస్ ప్రసాద్, ఆర్.పీటర్, ఎస్ ఎమ్ సుభాని, ఎం.శ్రీనివాసరావు, డి.వినోద్, బి.భగత్‌సింగ్, కె.శరత్, ఎఎమ్ఆర్ ఆనంద్, వి.శివప్రసాద్‌లను ప్రకటించగా సభ ఆమోదించింది.


**శ్రీ భవానీ శంకరస్వామి దేవాలయం**

అలుగుమిల్లిపాడు (గ్రా), దాచేపల్లి(మం), పల్నాడు జిల్లా.

NIT No.P1/COE/1307/2023, Dt.26/10/2023

**e-Procurement Tender**

దేవాలయ పునఃనిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి


## ప్రగడ కోటయ్యకు నివాళి

ప్రజాశక్తి-పెదకూరపాడు

చేనేత ఉద్యమ నాయకులు ప్రగడ కోటయ్య ఆశయాలు నెరవేరుస్తామని జిల్లా చేనేత ఐక్యవేదిక సంఘం అధ్యక్షులు చిల్లాపల్లి సత్యం అన్నారు. ఆదివారం పెద కూరపాడు మండలంలోని లగడపాడులో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సత్యం మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయడమే నిజ మైన నివాళి అని అన్నారు. కోటయ్య స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత అభివృద్ధికి సహకరించాలన్నారు.

## నియోజకవర్గ జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులుగా గోలి యలమందయ్య

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గ జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులుగా గోలి యలమందయ్య, రాష్ట్ర అధ్యక్షులు రుషింగప్ప చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఆదివారం ఈ సందర్భంగా పెదకూరపాడు మండలం గారపాడు గ్రామానికి చెందిన యలమందయ్య మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నిస్తానన్నారు.


**CHANGE OF NAME**

I **CHENNAMSETTY SRINIVAS** (Old Name), S/o (Late) **CHENNAMSETTY VENKATESWARA RAO**, R/o D.No. 6-26-32/1, Salipeta, Donka Road, Guntur, Guntur District - 522002, Andhra Pradesh, have changed my name to **CHENNAMSETTY SRINIVASA RAO**. Hereafter my name is known as **CHENNAMSETTY SRINIVASA RAO.**



**మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**క్రెడిటార్ ఐ.పి.51/2023**

బిట్వీన్:

1)నాయుడు నటరాజ శేఖర్ మరియు 20 మంది ఇతరులు ...పిటీషనర్స్

మరియు

1)కోడె మస్తాన్‌రావు వగైరాలు ...రెస్పాండెంట్స్

టు

కోడె మస్తాన్‌రావు తండ్రి వెంకట్రామయ్య అలియాస్ వెంకట్రావు, డోర్ నెం.6-37, అప్పాపురం గ్రామము, హెచ్/ఒ ఇర్లపాడు గ్రామము, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనర్స్ మిమ్ములను ఇన్సాల్‌వెంట్ గా డిక్లేర్ చేయమని క్రెడిటార్ ఐ.పి దాఖలు చేసియున్నారు. పై నెంబరు దావాలో, మీకు పలుమార్లు దావా సమన్లు పంపగా, మీకు ముట్టనందున, మరియు మీరు తీసుకోనందున శ్రీకోర్టువారు మీకు పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తమై ఉత్తర్వులు జారీ చేసినందున ది.15-12-2023వ తేదీ ఉ॥ 10-30 ని॥లకు, మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపు కోవలసినది. లేని యెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడునని ఈ పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది:15-12-2023

**బై కోర్టు ఆర్డర్:**

**శ్రీ బొగ్గరం సురేష్‌కుమార్,**
**పిటీషనర్స్ తరుపు అడ్వకేట్,**
**నరసరావుపేట.**

గిరి ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన చిన్నారుల పార్క్

## కోటప్పకొండ గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు సిద్ధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కోటప్పకొండ గిరి ప్రదర్శనకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని పల్నాడు జిల్లా అడవి శాఖాధికారి ఎన్ .రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం గిరిప్రదక్షిణ తరహాలోనే గిరిప్రదక్షిణపై గైడ్ మ్యాప్‌తో కూడిన సమాచార బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్గంలో కొత్త రఫ్ గ్రానైట్ బెంచీలు, గిరి బాల విహార్ పార్క్, మరుగుదొడ్లు సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో భద్రతను పటిష్టం చేసేందుకు నైట్ వాచ్‌మెన్‌ని నియమించారు. గిరి బాల విహార్ వద్ద ,గిరిప్రదక్షిణ దారిలో సుందరీకరణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## ఎపి మోడల్ స్కూల్‌లో నేషనల్ సైన్స్-2023 పరీక్ష

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో వి.రెడ్డిపాలెంలో గల ఎపి మోడల్ స్కూల్ లో ఆదివారం నేషనల్ సైన్స్-2023 పరీక్ష నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఇండి యన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆధ్వర్యంలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ విభాగాలలో పరీక్ష జరిగింది. ఈ పరీక్ష ను పరిశీలించిన ప్రిన్సిపాల్ బి.రవినాయక్ మాట్లాడుతూ ఈ పరీక్షలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం, సర్టి ఫికెట్లతో పాటు ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ లో పాల్గొనే అవ కాశం ఉంటుందని చెప్పారు. ఇటువంటి నేషనల్ స్థాయి పరీ క్షలు నిర్వహించడం వలన పిల్లలకు సైన్స్ పట్ల ఆసక్తి పెం పొందుతుందని అన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఐఇఇ, ఎన్ ఇటి వంటి పరీక్షలు, ఇతర పోటీ పరీక్షలకు మంచి ఫలి తాలను సాధించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

## ఒరిగిన విద్యుత్ స్తంభం .. పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి-నూజెండ్ల

వినుకొండ నూజెండ్ల రహదారి మధ్య చాట్రగడ్డపాడు గ్రామ సమీపంలో గతంలో వీచిన గాలి వానలకు విద్యుత్ స్తంభం ఒరిగి పోయింది, గత కొంతకాలంగా విద్యుత్ స్తంభం ప్రమాదకర రీతిలో వాలి కింద పడేలా ఉంది, విద్యుత్ వైర్లు దాదాపుగా చేతికి అందెంత ఎత్తులో ఉండడంతో ఏ సమయంలో అయినా ప్రమాదం జరగ వచ్చని గ్రామస్తులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి పడిపోయేలా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తిరిగి సరి చేయాల్సిందిగా కోరుతున్నారు.

# ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పుర స్కరించుకొని ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మంత్రి మాటా ్లడుతూ ఈ దేశానికి ఉన్నత విలు వలతో కూడిన రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని అన్నారు. నాటి సమాజంలో ఉన్న అనేక అసమాన తలు, రుగ్మతలను అధిగమించి ఉన్నత విద్యలను అభ్యశించి ప్రపంచ ఖ్యాతిని పొందిన మహెూన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. నేటి యువత అం బేద్కర్ ఆశయాలకు వారధిగా నిల వాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ 150 అడు గుల అంబేద్కర్ విగ్రహంతో పాటు ఒక పుస్తక భాండారాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అం బేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివా ళులు అర్పించారు. స్థానిక యార్డు చైర్మన్ పి.బాబురావు, ఎస్సీ సేల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చిలుక జయ పాల్, దిబిఆర్సీ నాయకులు మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని గడియార స్తం భం సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తన శ్రేణులతో కలిసి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ రాజ్యాంగ ఆమోద దినో త్సవం జరుపుకోవడం గొప్ప విషయ మన్నారు. డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి తన అనుచరులతో కలిసి పల్నాడు రోడ్డులోని జిబిఆర్ హాస్పిటల్ నుండి గడియార స్తంభం సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిపి గడ్డం వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి వెంకట్రావు మాట్లాడారు. అనం తరం భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయిం చారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సం ఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, వైసీపీ ఎస్ సి సెల్ మండల నాయకులు దొప్పలపూడి దిబ్బయ్య, ఎంఆర్ పియస్ మండల కన్వీనర్ మక్కెన పుట్టయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక మున్సిపల్ పాఠశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వ హించినట్లు ప్రధానోపాధ్యాయులు కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోటు శ్రీనివాస రావు, ఎ.నీలిమ, టి.కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి తహశీల్దార్ కార్యా లయంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. అంబేద్కర్ చిత్ర పటానికి తహశీల్దార్ ఎస్.సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు ఎంఇఒ రాఘ వేంద్రరావు లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

స్థానిక మండల పరిషత్తు కార్యా లయంలో రాజ్యాంగ పీఠికను అవిష్క రించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్తు కార్యాలయ సూపరిం టెండెంట్ శ్రీనివాసరావు,ఎపిఎమ్ బాల స్వామి, మండల కో ఆర్డినేటర్ మన్నం బ్రహ్మానందం పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

నరసరావుపేట రోడ్డులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి సీనియర్ నాయకులు మక్కెన మల్లి కార్జునరావు తన బృందంతో కలిసి అంబే ద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గంటా కాలేశా, లాయర్ జెట్టి తిరుపతిరావు, లాయర్ తులం శ్రీనివాసరావు, లాయర్ ధర్మానాయక్, గుడివాడ గురునాథం, ఎలి సెట్టి నరసింహారావు, రెడ్డి వెంకటరత్నం , మస్తాన్ నాయక్, జయరావు, పేరిరెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

మహోన్నత ఆశయంతో రాజ్యాంగ రూపకల్పన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహోన్నత ఆశయంతో రాజ్యాం గానికి రూపకల్పన చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను దేశం ఎన్నటికీ ఆయన్ని మరువదని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయిం చారు. కలెక్టర్ ఆఫీసులో ఏర్పాటు చేసిన రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక విధుల బోర్డులు ముందు రాజ్యాంగ పీఠికలోని అం శాలను, ప్రాథమిక విధులను చదివారు. కార్యక్రమంలో రెవెన్యూ జిల్లా విద్యాధికారి శామ్యూల్ జిల్లా గిరిజన సం క్షేమ అధికారి వరలక్ష్మి జిల్లా ఉద్యానవన అధికారి బెన్నీ పాల్గొన్నారు.

## పల్నాడు, ప్రకాశం జిల్లాల డాన్స్ డైరెక్టర్ల సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు, ప్రకాశం జిల్లాల డాన్స్ డైరెక్టర్ల సమావేశం ఆదివార స్థానిక సిపిఎం కార్యా లయం ఆవరణలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా నేలపట్ల హరిబాబు ఆర్టీసీ డైరెక్టర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ పల్నాడు, ప్రకాశం జిల్లాల కళాకారుల గుర్తింపు కార్డులు త్వరలో అందజేస్తామని, ఇప్పటికే దాదాపుగా కార్యరూపం దాల్చాయని త్వరలో అందజేస్తామని చెప్పారు. ఇప్పటివరకు గుర్తింపు కార్డులు లేని కళాకారులు ఉంటే అధ్యక్షులను సంప్రదించాలని చెప్పారు. ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు మూడు, రేషన్ కార్డు, బ్లడ్ గ్రూప్ నుకు సంబంధించిన వివరాలను అందజేయాలని అన్నారు. సమావేశంలో ఎ.సాల్మన్ రాజు, పిఎల్ కుమార్, కె.నాగేశ్వరరావు, ఇశ్రాయేలు, ఎం.కోటేశ్వరరావు, డి.దానియేలు, డి.స్కైలాబ్, బి.వెంకట్రావు, పల్లె అంజయ్య ఎన్ఎస్ కుమార్, ఎం.కోటేశ్వరరావు, ఓట్ల ఆంజ నేయులు, పి.వాసు, ఆర్.నరసింహారావు,ఎం విజయ బాబు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు. అంతకుముందు భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

## మహాధర్నాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

సిఐటియు ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కార్యదర్శి మాచర్ల బుజ్జి కాకాని అప్పారావు పిలుపు నిచ్చారు. జగన్ నాడు తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ంలోని సిఐటియు ఆధ్వర్యంలో పనిచేస్తున్న వివిధ కార్మిక సంఘాలు ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య మిత్రాలకు హెల్త్ డిపార్టుమెంట్‌లో ఉన్న క్యాడర్ ,జీతాల పెంపుదల వేగవంతం చేయాలని, ఆరోగ్య మిత్రులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

వికసిత్ భారత్ సంకల్పయాత్ర లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కార్యక్రమం మాచర్ల రూరల్ పరిధి కంభంపాడు, గన్నవరం గ్రామాలలో ఎంపీడీవో సరోజినీ దేవి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. గ్రామ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అనంతరం మెడికల్ క్యాంపును నిర్వహించారు. భారత రాజ్యాంగం ఆమోదం దినోత్సవ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమానులు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# రాజ్యాంగం నుండి స్ఫూర్తి పొందాలి

**ప్రజాశక్తి-గుంటూరు**

భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్ర పటానికి జిల్లా జెసి జి.రాజకుమారి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనగంగా నివాళులు అర్పించారు. జెసి రాజకుమారి భారత రాజ్యాంగ ప్రవేశిక చదివి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జెసి మాట్లాడుతూ కార్యనిర్వహణలో భాగంగా ఉన్న ఉద్యోగులు భారత రాజ్యాంగ స్ఫూర్తితో విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, బాధ్యతలు తెలుసుకొని వాటిని నిర్వర్తించినపుడే రాజ్యాంగానికి మనం ఇచ్చే గౌరవం అని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీఖర్, ఎస్సీ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు, డిసిఒ వీరాచారి, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

జిఎంసి కార్యాలయంలో..

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆదివారం జిఎంసి అడిషనల్ కమిషనర్ కె.శివలక్ష్మీ, ఇతర అధికారులు అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిప్స్ ఫార్మసీ కాలేజీలో..

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజీ (చిప్స్)లో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో

అరండల్‌పేటలోని మినీ అంబేద్కర్ భవన్‌లో నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి బీమ్ భారత్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ పూర్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.రమేష్‌పారా, ఎఎన్‌యు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వసంతరావు, దళిత మహాసభ రాష్ట్ర నాయకులు కె.విల్సన్, ఉగ్గం సాంబశివరావు, బిసి మహాసభ నాయకులు ముత్తయ్య పాల్గొన్నారు.

**వైసిపి కార్యాలయంలో**

అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితోనే బడుగు, బలహీన వర్గాలకు వివిధ రంగాల్లో ప్రభుత్వం పెద్దపీట వేసోతందని వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్ అన్నారు. వైసిపి ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బి.బ్రహ్మానందరెడ్డి, డి.జాన్‌బాబు, ప్రసాద్, రాధా మాధ, పి.మేరీ, ఝాన్సీ, వీరమనేంద్ర పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - తాడికొండ**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అదరిపై ఉందని వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. గుంటూరు నగరంలోని తాడికొండ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతో పేద, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు, మహిళలకు ఎంతో న్యాయం జరిగిందన్నారు. వాలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. పవన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బి.బ్రహ్మారెడ్డి, నాయకులు బి.వెంకటేశ్వరరెడ్డి, కె.శేషగిరిరావు, టి.శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.పూర్ణచంద్రరావు, ఎ.జోజి, షేక్ అబ్బాస్, ఎన్.రాజేంద్ర పాల్గొన్నారు.



**ప్రజాశక్తి - తుళ్లూరు**

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపిటిసి జొన్నకూటి ఏడుకొండలు, అమరావతి దళిత మహిళా జెఎసి కన్వీనర్ అంకం సువర్ణ కమల, టిడిపి నాయకులు మేరిగ నాగేశ్వరరావు, ఎం.రవి, ఎ.నాగరాజు, బి.బెనర్జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ పౌరునిగా స్వేచ్ఛతో కూడిన ఉన్నత జీవనం సాగించేందుకు రాజ్యాంగంలో నిర్దేశించిన హక్కులు ఎంతగానో దోహద పడతాయని అన్నారు.

**ప్రజాశక్తి - తెనాలి**

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్ ఎల్.సుబ్బారావు మాట్లాడారు. శానిటరీ ఎన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.లక్ష్మినారాయణ, సిబ్బంది జీ.వి.శ్రీనివాసరావు షేక్ బషీర్ పాల్గొన్నారు.

స్థానిక దేవిచౌక్‌లోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో కార్మికులకు రాజ్యాంగం, మానవ హక్కుల గురించి అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు పల్నాటి నాగరాజు మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఆర్.శివకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి కె బాబుప్రసాద్, ఐక్యవేదిక ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చేబ్రోలు**

మండలంలోని చెరువులో పాలెం, చేబ్రోలు మసీదు సెంటర్, వడ్లమూడి అన్నపూర్ణ కాలనీలో చేబ్రోలు, పొన్నూరు, తెనాలి అంబేద్కర్-బాబూ జీగ్జీవన్‌రామ్ యువజన సమాజం ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేశారు. కుమార్ బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన ఎంద్రపాటి అశోక్, గల్లా జ్ఞానశేఖర్, ఎమ్‌డి ఎం/ఎస్ గ్రానీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మాట్లాడారు. కె.రాజేంద్ర, కె.రత్నాకర్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎ.సంజయ్, చేబ్రోలు సర్పంచ్ పచ్చిగండ్ల వినీతా రాణి, పి.రాజేష్, కె.కిరణ్, చందు సాంబశివరావు, డి.రత్నరాజు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

పొన్నూరు పట్టనంలోని ఐలాండ్ సెంటర్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలేసి నివాలులర్పించారు. ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బి.బాబురావు, పి.అహ్మద్ ఖాన్, నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, ఫిరోజ్ ఖాన్, సోంబాబు, వీరబాబు, బాషా పాల్గొన్నారు.

**ప్రజాశక్తి, పెదకాకాని రూరల్**

స్థానిక గ్రంథాలయాధికారి వి.విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి హాజరయ్యారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేశారు. రాజ్యాంగ పీఠిక పఠన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. స్రవంతి, జ్యోతి పాల్గొన్నారు.

## మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి - తాడేపల్లి, తాడేపల్లి రూరల్**

మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, టిడిపి తాడేపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు పుట్టినరోజు సందర్భంగా ఎమ్‌టిఎంసి పరిధిలోని కొలనుకొండ మారుతి ఫౌండేషన్ వాలీబాల్ గ్రౌండ్లో ఆదివారం పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా మారుతీ ఫౌండేషన్ జట్టు విజయం సాధించింది. విజేతలకు బహుమతులను సోమవారం ప్రదానం చేస్తామని ఫౌండేషన్ అధినేత జంగాల సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు వి.స్టాలిన్, మెల్లెంపూడి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, తెలుగు యువత మంగళగిరి నియోజకవర్గ ఉపాధ్యక్షులు షేక్ ఖాసింబాబు పాల్గొన్నారు.

## పాడి రైతుల ముసుగులో సంగం డైయిరీని కైవసం చేసుకున్న నరేంద్ర : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

పాడి రైతుల ముసుగులో సంగం డెయిరీని ధూలిపాళ్ల నరేంద్రకుమార్ కైవసం చేసుకున్నారని, బోనస్ డబ్బుల కోసం వచ్చిన టిడిపికి చెందిన పాడి రైతులపై దాడి చేయించారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పొన్నూరులోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమూల్ సంస్థ పోటీని తట్టుకోలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. పాడి రైతుల ధర్నా కేసులో పారారైన నరేంద్రకుమార్ చివరికి రైతు తామే కేసు పెట్టించామంటూ తనతోపాటు సిఎం జగన్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కొట్టేసిన బోనస్ డబ్బులను పాడి రైతులకు ఇవ్వాలని, వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# ఎన్‌ఆర్‌ఐ అగ్రిటెక్ 'అమర' వరి విత్తనం క్షేత్రప్రదర్శన

మాట్లాడుతున్న డాక్టర్ ఆలపాటి రవీంద్ర

**ప్రజాశక్తి-తెనాలి**

ఎన్‌ఆర్‌ఐ అగ్రిటెక్ ప్రైవేటు టిమిటెడ్ ఆవిష్కరణ 'అమర' వరి వంగడపై మండలంలోని కఠెవరంలో ఆదివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని రైతు అంజిబాబు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ప్రదర్శనలో ఎనఆర్‌ఐ అగ్రిటెక్ ప్రవేటు లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఆలపాటి రవీంద్ర మాట్లాడుతూ ఆరోగ్యకరమైన విత్తనాల ఎంపికలో రైతు జాగ్రత్త వహించాలన్నారు. అధిక దిగుబడి, ఆరోగ్య కరమైన పంటలపై నిరంతర పరిశోధన కొనసాగుతుందని, దాని ఫలితంగా అమర వరి వంగడం రూపుదిద్దుకుందన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులకు బిపిటి, మసూరి రకాలంటే మక్కువన్నారు. రైతులు అభిరుచులకు అనుగుణంగా బిపిటి, మసూరి రెండు రకాల లక్షణాలు కలిగిన అమర వరి వంగడం ప్రవేశపెట్టామని చెప్పారు. రైతు అంజిబాబు అమర వరి విత్తనంతో సాధించిన విజయాలను వివరించారు. అమర విత్తనం దుబ్బు కూడా బాగా చేస్తుందని, బిపిటి కంటే 10 రోజుల మందుగానే పంట దిగుబడి ఉంటుందని, ఎకరానికి 40 నుంచి 48 బస్తాల దిగుబడి ఉందని, బిపిటి రకానికి 6 నుంచి 10 సార్లు పురుగు మందులు చల్లితే, అమర విత్తనానికి ఒకసారి మాత్రమే పురుగు మందు పిచికారి జరిగిందని, వరి కంకిలో బిపిటికి 240 గింజలుంటే, అమర రకానికి 350 గింజలున్నట్లు వివరించారు. రైతులు లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్‌ఆర్‌ఐ శాస్త్రవేత్త డాక్టర్ గోపి సమాదానమిచ్చారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ కె.సాంబిశివరావు, జిఎం వెంకట్, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి.రవిబాబు, జిల్లా నాయకులు ఎం విల్సన్

## మతోన్మాద ప్రభుత్వంతో దళిత హక్కులకు ప్రమాదం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దళిత హక్కులను కాపాడుకోవడానికి డిసెంబర్ 4వ తేదీన ఢిల్లీలో జరగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవి పిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవి బాబు అన్నారు. డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంఘీభావంగా మండల పరిధిలోని మురికిపూడిలో సంతకాల సేక రణ శనివారం రాత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాం గానికి, దళితుల హక్కులకు ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తూ మతోన్మాద అజెం డాను ప్రజల్లోకి తీసుకెళ్తోందని విమర్శిం చారు. దళితు లకు రక్షణగా ఉన్న ఎస్సి,ఎస్టి అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేవిధంగా మార్పులు చేసి దళితుల రక్షణను ప్రమాదంలో పడేటట్టు చేసిందని విమర్శించారు. లౌకిక భారత రాజ్యాంగాన్ని, దళిత హక్కులను కాపాడు కొని సామాజిక న్యాయం సాధించడానికి దళిత సోషణ్ ముక్తి మంచ్, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర అనేక దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే మహా ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్య క్రమంలో దళిత నాయకులు జె.ఆదిబాబు, పున్నారావు, సుధాకర్, యెహోషువ, అనిల్ పాల్గొన్నారు.

'విద్యార్థి మేలుకో భవిష్యత్తు కాపాడుకో' వాల్ పోస్ట ర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

## విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి

**టిఎన్ఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరావు**

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

జాతీయ విద్యా విధానం పేరిట విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మార్పులు వలన ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవు తుందని ఫలితంగా పేద బడుగు బలహీన వర్గాలకు చెం దిన చిన్నారులు పాఠశాల బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని టిఎన్ఎస్ఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కూరపాటి హనుమంతరావు అన్నారు. స్థానిక టిడిపి జిల్లా కార్యా లయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో కూరపాటి మాట్లాడుతూ విద్యార్థులకు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయా లన్నారు. 'విద్యార్థి మేలుకో భవిష్యత్తు కాపాడుకో' వాల్ పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా నెల రోజుల పాటు విద్యా వ్యవస్థలో ప్రభుత్వ వైఫల్యాలపై వివిధ రూపాల్లో అవగాహన కల్పించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలులో జరిగిన అన్యాయం పై చైతన్యం తీసుకు రావాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నరసరావుపేట నియోజక వర్గ అధ్యక్షులు యేనుగంటి భార్గవ్ సాయి, జిల్లా అధికార ప్రతినిధి ధైదా చిన్నబాబు, జిల్లా కార్యదర్శి పటాన్ అబ్దుల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా, ఉపాధ్యక్షులు రామయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి శివ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ దోపిడీకి పాల్పడుతున్న పిన్నెల్లి సోదరులు

**జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు**

ప్రజాశక్తి - వినుకొండ

అక్రమ మైనింగ్ సందర్శనకు వెళు తున్నామని పోలీసులు ఆదివారం ఉదయం తన ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహ రించి గృహనిర్బంధం చేయడం దుర్మార్గ మని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. వినుకొండలోని ఆయన నివాసంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు మాట్లా డుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాదులోని తన ఇంట్లో జరిగే పూజా కార్యక్రమానికి బయలుదేరి వెళు తుండగా పోలీసులు అడ్డుకొని గృహ నిర్బంధం చేశారని చెప్పారు. తాను హైదరాబాదు వెళ్లాలని పోలీసులకు విన్న వించిన పట్టించుకోకుండా గృహనిర్బంధం చేశారని అన్నారు. తన వ్యక్తిగత స్వేచ్ఛను కూడా హరించారని, దీనిపై పల్నాడు జిల్లా పోలీసులపై చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని జీవి ఆంజనేయులు తెలి పారు. మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి బ్రహ్మానందరెడ్డిని కూడా హౌస్ అరెస్టు చేయడం చట్ట విరుద్ధమన్నారు.

మాచర్ల నియోజకవర్గంలోని కారం పూడి మండలం పేట సనిగండ్ల వద్ద కోట్లు విలువ చేసే ఖనిజాన్ని అక్రమంగా ఎమ్మెల్యే పిన్నెల్లి బ్రదర్స్ యధేశ్చగా దోచు కుంటుంటే అరికట్టాల్సిన అధికార యంత్రాంగం దోపిడీదారులకు కాపలా కాస్తోందని ఆరోపించారు. దేవాదాయ భూముల్లో ఉన్న ఖనిజ సంపద మైనింగ్ను అక్రమంగా వేల ట్రక్కులు నిత్యం తరలిస్తుంటే అరికట్టడం చేతగాని పోలీస్ అధికారులు గృహనిర్బంధాలకు పాల్ప డటం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఆదా యానికి గండికొడుతూ ప్రజాధనాన్ని లూటీ చేస్తు యధేశ్చగా అక్రమ మైనింగ్ దోపిడీ జరుగుతుంటే అరికట్టాల్సిన సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నిం చారు. అక్రమ మైనింగ్ దోపిడీలో సీఎంకు వాటాలు అందుతున్నాయి కనుకనే మౌనంగా ఉన్నారని ఆరోపించారు. దొంగ ఓట్ల చేర్పులకు సహకరించిన అధికారులను వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. అన్యాయంగా అక్రమంగా ప్రలోభాలకు లోనై కేసులు బనాయించే వారిని ఎవరిని ప్రజలు వదలని స్పష్టం చేశారు. పేట సన్నిగండ్ల దేవాదాయ భూముల్లో కోట్లు విలువ చేసే ఖనిజం మైనింగ్ అక్రమ దోపిడీపై టిడిపి సం దర్శన చేసి న్యాయ పోరాటం చేస్తుం దని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం పేట సన్నగండ్ల గ్రామంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్రమ మైనింగ్ నిర్వహించి అక్కడ దొరికే బాక్సైట్ ను విదేశాలకు తరలించి వందల కోట్లు సంపాదిస్తున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ఆరో పించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ విషయంపై ప్రశ్నించినందుకే తమను మైనింగ్ జరిగే ప్రాంతం వద్ద పరిశీలనకు వెళ్లకుండా హౌస్ అరెస్టు చేశారని తెలి పారు. అక్రమ మైనింగ్ పై పరిశీలన చేసి ప్రజలకు తెలిపే హక్కు లేదా అని ప్రశ్నిం చారు. గురజాల,మాచర్ల నియోజక వర్గాల్లో అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా సాగు తోందని, తెలంగాణ మద్యం నాసి రకం మద్యం ఇసుక దందా పేకాట క్లబ్‌ల నిర్వహణ, తమ నాయకుల పై అక్రమ కేసులు పెట్టడం వంటి అక్రమాలు జరుగు తున్నాయని అన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా మాచర్ల నియోజక వర్గంలో ప్రభుత్వ, పోరంబోకు, దేవా దాయ భూముల్లో భూములలో జరుగు తున్న అక్రమ మైనింగ్ ప్రాం తాలను పరిశీలించేందుకు వెళుతున్న పల్నాడు జిల్లాలోని టిడిపి నియోజకవర్గాల బాధ్యు లను ముందుగానే అడ్డుకొని గృహ నిర్బం ధాలు చేయడం పిరికిపంద చర్య అని టిడిపి జిల్లా కార్యాలయంలో ఓ ప్రకటనలో విమర్శించింది. అక్రమ గృహ నిర్బంధాలపై డిజిపి, ఎస్పిలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది..

మాట్లాడుతున్న జివి ఆంజనేయులు

## జివి ఆంజనేయులు గృహనిర్బంధం

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విను కొండ పోలీసులు ఆదివారం గృహ నిర్బంధం చేశారు. మాచర్ల నియోజక వర్గం కారం పూడి మం డలం పేటసన్ని గండ్లలో అక్రమ మైనింగ్ సందర్శిం చేందుకు జివి ఆంజనేయులు వెళ్తున్నారని వినకొండ పోలీసులు ముందస్తు నోటీ సులు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా హైదరాబాదులోని తన నివాసంలో జరిగే పూజా కార్య క్రమాలకు జీవీ ఆంజ నేయులు వెళుతుండగా మైనింగ్ వద్దకు వెళ్తున్నారని భావించి పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆంజనేయులు నివాసం చుట్టూ పోలీసులు మోహరించారు.

# సంక్షేమ పథకాలను వినియోగించుకోండి

జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వి నియోగం చేసుకుంటూ అభివృద్ధి బాటలో పయనించాలని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. కేంద్ర నుంచి వచ్చిన వికసిత్ సంకల్ప యాత్ర వాహనాన్ని రిబ్బన్ కత్తి రించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వాహనంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్, అందులో ప్రసారమవు తున్న 7.5 నిమిషాల నిడివి గల లఘు చిత్రాలను ఆయన పరిశీలించారు. ప్రజల జీవితాలలో మార్పు తీసుకురావ డానికే కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచ డానికి కేంద్ర ప్రభుత్వంఈ యాత్రను చేపటనట్లు చెప్పారు.

వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని 527 పంచాయతీలలో ఈ యాత్ర సాగు తుం దన్నారు. ఇందుకోసం జిల్లాకు 4 వాహనాలు కేంద్రం నుంచి వచ్చా యని, ప్రతిరోజు నాలుగు రూట్ లలో వాహనాలు పర్య టించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆయా పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. పక్కా గృహాల నిర్మాణం, ఇంటింటికి కుళాయి కనెక్షన్‌తో తాగనీరు వంటి 17 రకాల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం జిల్లా ఉద్యానవన శాఖాధికారి బెన్నీ పాల్గొన్నారు.

## ప్రచార కార్యక్రమం ప్రారంభం

జిల్లాలో నిర్వహించ తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఐఇఎస్ వాహనాల ప్రచార కార్యక్రమాన్ని స్థానిక నరసరావుపేట లింగంగుంట్ల గ్రామ పంచాయతి కార్యాలయం నుండి ఆదివారం లాంఛ నంగా ప్రారంభించారు. ప్రతిజ్ఞ అనంతరం దృశ్య శ్రవణ మాధ్యమికం ద్వారా ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రసారం చేశారు. ఈ సందర్భంగా డ్రోన్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రయోగత్మకంగా చూపించారు. ఈ సందర్భంగా పలు వురు లబ్ధిదారులకు భూసార పరీక్ష పత్రాలను అంద జేశారు.ఐసిడిఎస్, సేంద్రీయ వ్యవసాయం, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాల అమలుపై స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజల అవగాహన కల్పించారు అనంతరం మాజీ సైనిక ఉద్యోగి ఉరియా ఏడుకొండలు, అంత ర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు ఎం.హరిప్రియ, సీనియర్ సిటిజన్ ఎన్.సత్యనారాయణరెడ్డి ని సత్కరిం చారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అబివృద్ధి సంక్షేమ పథకాలపై కరపత్రాలు క్యాలెం డర్లు, బుక్‌లెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.వినాయకం, వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా కోఆర్డినేటర్లు బెన్నీ, భాస్కర్ రెడ్డి, సేంద్రియ వ్యవ సాయ అధికారి అమలకుమారి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి అరుణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి, సచివాలయ పంచాయతి సెక్రెటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న అధికారులు

## 'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి ద్వారానే రాష్ట్రాభివద్ధి సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. ఆదివారం జనసేన కార్యా లయంలో సయ్యద్ జిలానీలు సమావేశమయ్యారు. నరసరావు పేట నియోజకవర్గంలో విజయం కోసం టిడిపి-జనసేన కూటమి పని చేస్తుందని ఇరుపార్టీల నేతలు చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో టిడిపి-జనసేన కమిటీ ఏర్పాటు చేసుకుని దిశా నిర్దేశం చేస్తున్నా మన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయానికి ఇరు పార్టీల నాయకులు,కార్యకర్తలు ఏక తాటి పైకి రావాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు షబ్బీర్, టిడిపి నాయకులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, రాష్ట్ర బిసి నాయకులు కడియం కోటి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ కొర్నేపాటి సంజీవరావు, చల్లగుండ్ల హరికృష్ణ ,పెండ్యాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శీనునాయక్‌కు ఉత్తమ జాతీయ సేవా పురస్కారం

ప్రజశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని జయ జయ సాయి ట్రస్ట్ నిర్వా హకులు డాక్టర్ పూస పాటి బాలాజీ ఆధ్వ ర్యంలో ఉత్తమ జాతీయ సేవా పుర స్కార అవార్డుల మహోత్సవ కార్యక్రమం ఆదివారం సుబ్బయ్య తోటలో జరిగింది. ఈ సందర్భంగా ప్ర జలకు సేవలందించిన కారణంగా ఇ చ్చే ఈ అవార్డును ఎపి గిరిజన సంఘాల ఐఖ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ కు ప్రదానం చేసినట్లు తెలిపారు.

# డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలి

సమావేశంలో పాల్గొన్న అధికారులు, కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటి సభ్యులు కోరారు. ఆదివారం కమిటి సభ్యులు నాజ్ సెంటర్‌లోని ఎల్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీయాలని, లేకుంటే మురుగు నిలిచి ప్రజారోగ్యానికి భంగం కలుగుతుందని, దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజారోగ్య సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో క్లోరిన్‌ను తగు మోతాదులో కలపాలన్నారు. నగరంలో జరుగుతున్న రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎమినిటి కార్యదర్శుల ద్వారా పర్యవేక్షణ చేయించాలని సూచించారు. కమిటి సభ్యులతో జిఎంసి ఎస్ఇ భాస్కర్ మాట్లాడుతూ ఇప్పటికే డ్రెయిన్ల శుభ్రానికి నాలా క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులోకి వచ్చాయని, త్వరలో అన్ని డ్రెయిన్లను శుభ్రం చేయటానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని వివరించారు. అభివృద్ధి కమిటి సభ్యులు సూచించిన అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇఇలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటి సభ్యులు పరందామయ్య, జోగారావు, నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

## షాపుల వ్యర్థాలను కాల్వల్లో వేయొద్దు

ప్రజాశక్తి - తెనాలి

షాపుల నుంచి వెలువడే వ్యర్థాలను కాల్వలో వేయకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిపోయిన రాధిక కోరారు. చైర్పర్సన్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం తొలిసారిగా పట్టణంలో సైడ్ డ్రెయిన్స్ పరిశీలించారు. గాంధీ చౌక్ నుంచి స్వరాజ్ టాకీస్ వరకు సైడ్ డ్రెయిన్స్‌లో పూడిక తీయించారు. కాల్వల్లో నీటిపారుదలకు అడ్డంకిగా మేట వేసిన ప్లాస్టిక్ బాటిల్స్, కవర్స్, ఇతర వ్యర్థాలను గమనించి తొలగింపజేశారు. షాపుల నుంచి వ్యర్థాలను సేకరించేందుకు పారిశుధ్య కార్మికులు ఉన్నారని, చెత్త సేకరణ వాహనాలతో వచ్చినప్పుడు వ్యర్థాలను కార్మికులకు అందించాలని కోరారు. వ్యర్థాలను కాల్వల్లో వేస్తే మురుగునీటి పారుదల నిలిచి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని చెప్పారు. మున్సిపాల్టీకి వ్యాపారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ టి.రఘురాం, టి.రమేష్, శానిటరీ ఇనెస్పెక్టర్ బాజీ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

సైడ్ కాల్వల్లో పూడికలు తీయిస్తున్న చైర్‌పర్సన్

## ఆర్‌వి దత్తుకు నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

కాపుల అభ్యున్నతికి రంగిశెట్టి విజయదత్తు ఎనలేని కృషి చేశారని టిడిపి నాయకులు పేర్కొన్నారు. విజయదత్తు వర్థంతిని నియోజకవర్గ టిడిపి కాపుదళం కన్వీనర్ రంగిశెట్టి నరేంద్ర (బాబి) ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న విజయదత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.అబద్దయ్య, గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు డి.రాజు, నాయకులు పాల్గొన్నారు.

## ఆలయానికి సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

కార్తీకపౌర్ణమి నేపథ్యంలో ఆదివారం స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానం సందర్శకులతో కిటకిటలాడింది. ప్రాంగణంలో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా వైద్యారోగ్య శాఖ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు సిఐ బి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో నియంత్రణ చర్యలు చేపట్టారు. ఆలయాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపుతులు సందర్శించగా వీరికి దేవస్థానం ఇఒ ఎన్.శ్రీనివాసరెడ్డి, పాలకమండలి చైర్మన్ ఎ.శివశంకరరావు, సభ్యులు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణ ప్రసాదు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా వివిధ సేవా రుసుముల కింద ఆలయానికి ఆదివారం రూ.7.5 లక్షల ఆదాయం చేకూరినట్లు అధికారులు తెలిపారు.

# ఛానల్‌ను విస్తరిస్తే తాగు, సాగునీటి సమస్య పరిష్కారం

## 7వ రోజుకు రైతుల దీక్షలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం అధ్వర్యంలో మండల కేంద్రమైన పెదనందిపాడులో చేపట్టిన దీక్షలు ఆదివారం 7వ రోజుకు చేరాయి. దీక్షను ఉద్దేశించి నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ కృష్ణా జలాలను ఈ ప్రాంతానికి తరలించి కరువు కాటకాలను ఎదుర్కొంటున్న రైతులను కాపాడాలని కోరారు. తాగునీరుకు సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, గుంటూరు ఛానల్ పొడిగింపుతో ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. దీక్షలో ఆర్.అర్జునరావు, సిహెచ్.వెంకటరమణ, జె.వీరయ్య చౌదరి, జె.సుబ్బారావు, ఎల్.కోటయ్య చౌదరి, జి.శ్రీనివాసరావు, కె.వెంకటశివయ్య, బి.అమ్మయ్య, కె.వాణి, ఆర్.కౌసల్య, ఆర్.లక్ష్మి ప్రియ, డి.ఆదిశేషమ్మ, బి.నాగేశ్వరి, సిహెచ్.సుబ్బాయమ్మ, డి.సుబ్బాయమ్మ, కె.నాగరాజ, జి.సుబ్బారావు, డి.పిచయ్య, కె.బ్రహ్మయ్య, జి.వీరయ్య చౌదరి, ఎం.నాగేశ్వర్రావు, కె.అంకమ్మచౌదరి, ఆర్.బాపనయ్య, ఎం.నాగేశ్వరరావు, ఎం.రవి, ఎ.వెంకట సుబ్బారావు, కె.వీరప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కె.నిర్మల, కె.రత్న కుమారి, కె.సంపూర్ణమ్మ, ఎ.దేవకీదేవి, కె.వెంకయ్య చౌదరి, బి.హనుమంతరావు, కె.చిట్టెమ్మ, ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్, రామన్, ఎం.అమ్మయ్య కూర్చున్నారు.

నిరసన దీక్షలో పాల్గొన్న రైతులు, మహిళలే

# చిరస్మరణీయులు వట్టికూటి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-గుంటూరు

ఉన్నత కుటుంబంలో జన్మించినా సమాజం పట్ల బాధ్యతతో భూరి విరాళాలు అందించటంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై తనదైన శైలిలో సేవలందించి గుంటూరు గాంధీగా కీర్తింపబడిన వట్టికూటి వెంకట సుబ్బయ్య సేవలు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని స్తంభాలగరువు మహాప్రస్థానం సేవాసమితి అధ్యక్షులు వెలగపూడి లక్ష్మణరావు అన్నారు. వట్టికూటి వెంకటసుబ్బయ్య 23వ వర్ధంతి సందర్భంగా స్థానిక స్తంభాలగరువు మహాప్రస్థానంలో వట్టికూటి వెంకటసుబ్బయ్య విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహాప్రస్థానం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సంస్మరణ సభకు అధ్యక్షత వహించి లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు ఎన్.తిరుపతయ్య, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, అవగాహన కార్యదర్శి కె.శివరామిరెడ్డి, ప్రొఫెసర్ ఎన్.రంగయ్య, డి.హనుమంతరావు, ఎన్.శేషగిరిరావు, వి.హరిప్రసాద్, వి.తాండవకృష్ణ, వై.అంకమ్మచౌదరి, వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

## పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో పారా లీగల్ వాలంట్లీకు ఆదివారం శిక్షణిచ్చారు. జడ్జి నాగరాజు మాట్లాడుతూ ఈనెల 28 నుంచి డిసెంబరు 10 వ తేదీ వరకు జరిగే క్యాంపెయిన్ గురించి వివరించారు. చైల్డ్ వెల్ఫేర్, వికలాంగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథఖాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు లెనిన్, రాజేష్, రజని, రాజ్యలక్ష్మి, స్వరూప రాణి, పిఎల్‌విలు ఎం.రామ్మూర్తి, డి.నరసయ్య, లోక్ అదాలత్ ఇన్‌ఛార్జి సుభాషిణి పాల్గొన్నారు.

కొండ నాయక్ దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ దంపతులు

## 39 ఏళ్లు రిమార్కేమీ లేకుండా విధులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రైల్వే శాఖలో 39 ఏళ్లు పనిచేసి ఈనెల 30 తేదీన ఉద్యోగ విమరణ చేయనున్న మండల కేంద్రమైన దుగ్గిరాలకు చెందిన బాణావత్ కొండనాయక్ సన్మాన సభ ఆదివారం నిర్వహించారు. పలువురు రైల్వే సిబ్బంది మాట్లాడుతూ కొండనాయక్ సేవలను కొనియాడారు. సుదీర్ఘకాలం సర్వీసులో రిమార్కేమీ లేకుండా పని చేశారని చెప్పారు. అనంతరం కొండా నాయక్ దంపతులను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావతి ఖుషి బాయ్ వెంకటేశ్వర నాయక్, వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ, షేక్ జానీబాష, టి.సాంబశివరావు, టి.శ్రీనివాసరావు, సిద్ధయ్య, రమణ, సాంబయ్య పాల్గొన్నారు.

లక్కీడ్రా తీయిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

## పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-తెనాలి : పట్టణానికి చెందిన పద్మశాలి ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఐతానగర్‌లోని సాయిబాబా మందిరం ఆవరణలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. కార్తీక మాసం విశిష్టతను నోరి నారాయణమూర్తి వివరించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన లక్కీ డ్రా ఎమ్మెల్యే సమక్షంలో తీయించారు. కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం ముఖ్యమని, ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జివి రామకృష్ణ, సుబ్బారావు, కోశాధికారి టి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎ.బాలచంద్రమౌళి, కె.శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

## జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-తాడేపల్లి

జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఆదివారం జరిగింది. కుంచనపల్లి అరవింద హైస్కూల్లో జరిగిన ఎన్నికలకు రాష్ట్ర టెన్నికాయిట్ సంయుక్త కార్యదర్శి కాట్రగడ్డ అరవిందకుమార్ పరిశీలకులుగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా పి.విక్రమ్ వ్యవహరించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వై.బాలకృష్ణ ప్రసాద్, పిరజనీకాంత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సూర్యప్రకాషరావు, ట్రెజరర్ రామకోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రవి, ఎన్.హరికృష్ణ, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా ఆరుగురు ఎన్నికయ్యారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

క్రీడలు మానసిక ఉత్తేజానికి, శరీర దారుఢ్యానికి దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆటలాడాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్‌పి పాఠశాలలో 33వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ (బాల, బాలికల) అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి ఖోఖో ఛాంపియన్‌షిప్-2023 పోటీలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. తొలుత భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. క్రీడా ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని అన్నారు. నిరంతరం తరగతి గదిలో పరీక్షలకు సిద్ధం కావడం వంటి ఒత్తిడి నుండి విద్యార్థులకు ఉపశమనం కలుగుతుందన్నారు. మూడ్రోజులపాటు నిర్వహించనున్న పోటీలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల కోసం మంచి వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతి, ఎంపిపి ఎం.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి పి.చిట్టిబాబు, పిఇటిలు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

## వాహనాల బదిలీ సులభతరం

- జాతీయ పోర్టల్‌కు డ్రైవింగ్ లైసెన్సుల అనుసంధానం
- రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి
- వాహనదారులు బాధ్యతగా ఉండాలి
- ప్రజాశక్తితో జిల్లా రవాణా అధికారి కరీం

**ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలను కొనుగోలుచేసి రాష్ట్రంలో నడిపేందుకు వీలుగా బదిలీ విధానాన్ని ప్రభుత్వం సులభతరం చేసిందని జిల్లా రవాణా అధికారి షేక్ కరీం తెలిపారు. ప్రస్తుతం వాహనాల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయని, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తెచ్చుకోవాలంటే లైసెన్సు పొందిన రాష్ట్రం నుంచి నిరంభ్యంతర ధ్రువపత్రం (ఎన్‌వోసి) ఇస్తారని, దీనిని ఆన్‌లైన్‌లో ఉంచుతారని, ఈ మేరకు వాహనం బదిలీ జరుగుతుందని తెలిపారు. దొంగ వాహనాల అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందన్న ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలిపారు.**

**వాహనాల బదిలీ ఎలా జరుగుతోంది?**

వేరే రాష్ట్రానికి చెందిన వాహనాన్ని కొనుగోలు చేస్తే అక్కడి రవాణా అధికారుల నుంచి ఎన్‌వోసి తప్పని సరిగా ఉండాలి. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన తరువాతే వాహనం ఒకచోట నుంచి మరొక చోటుకు బదిలీ అవుతుంది. దొంగతనం చేసిన వాహనాలను విక్రయించకుండా ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అన్ని వివరాలను నమోదు చేసిన తరువాతే ఈ ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. ఏ రాష్ట్రంలో వాహనం తయారు చేశారు? ఎక్కడి నుంచి ఎక్కడికి బదిలీ చేశారు? సంబంధిత అధికారుల వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించిన తరువాతే ఆమోదిస్తారు. జాతీయ స్థాయిలో సాఫ్ట్‌వేర్ రూపొందించారు. వాహనం బదిలీకి సంబంధించిన ఫీజులను కూడా చెల్లించాల్సి ఉంటుంది.

**డ్రైవింగ్ లైసెన్సుల జారీలో వచ్చిన మార్పులు?**

డ్రైవింగ్ లైసెన్సులకు జాతీయ స్థాయిలో కొత్త పోర్టల్‌ను రూపొందించారు. గతంలో ఈ-ప్రగతి పోర్టల్ నుంచి ఇప్పుడు దేశం మొత్తం ఒకే విధానం అమలు చేస్తున్నారు. వాహనసారధి పోర్టల్ ద్వారా దేశం మొత్తం అనుసంధానం జరిగేలా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేస్తున్నారు. ఒక లైసెన్సుదారుడి వివరాలు దేశంలో ఎక్కడైనా పరిశీలించే అవకాశం ఉంది. కొత్త పోర్టల్‌లో ప్రస్తుతం రెన్యువల్స్ చేస్తున్నాం. త్వరలో లైసెన్సుల మేళా నిర్వహిస్తాం.

**ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?**

ఆటోలు, క్యాబ్‌లు, టాటా మేజిక్‌లపై నిఘాపెట్టాం. పరిమితికి మించి విద్యార్థులను, ప్రయాణికులను ఎక్కిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఆటోల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆటో వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై నిత్యం వేర్వేరు ప్రదేశాల్లో తనిఖీలు చేస్తుంటాం. ఈ తనిఖీల ద్వారా నెలకు రూ.కోటి 10 లక్షల వరకు ఫైన్ల రూపంలో ఆదాయం వస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిమితికి మించి ప్రయాణికులు ఉన్నా, లైసెన్సు, వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ లేకున్నా జరిమానాలు విధిస్తాం. వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం సరికాదు. కార్లు నడిపే వారు సీటు బెల్టు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి. వాహనాల్లో పరిమితికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించడం, అతివేగం తదితర కారణాలపై ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపైనా తనిఖీ చేసి జరిమానాలు విధిస్తున్నాం.

**రవాణశాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయ లక్ష్యం?**

జిల్లాలో 2023-24లో రూ.403 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు, త్రైమాసిక పన్నులు, రెన్యువల్స్, లైఫ్ టాక్సు తదితర అంశాల ద్వారా లక్ష్యం మేరకు ఆదాయం రాబట్టడానికి కృషి చేస్తున్నాం. ఈఏడాది ఇప్పటి వరకు రూ.268 కోట్ల వరకు ఆదాయం రాబట్టాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో ప్రచారం చేస్తున్న నాయకులు

## మహాధర్నా జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమ, మంగళవారాల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వడ్డేశ్వరంలో ఆదివారం ప్రచారం చేపట్టారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల దేశానికి పెనుముప్పు ఏర్పడిందన్నారు. దేశ సంపదనే కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా అమ్మేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సోమవారం విజయవాడలో జరిగే మహా ధరాలో అందరూ పాల్గొనాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం వలన వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బిజెపి ప్రభుత్వం పూనుకుందని మండిపడ్డారు. రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం కాల రాసిందన్నారు. సరైన ఉపాధి లేక వలస కూలీలుగా వెళ్తున్న కార్మికులకు పని భద్రత లేక, ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించిందని అన్నారు. రాబోయే రోజుల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి.పున్నయ్య, వి.రాజు, కె.శౌరి, వి.కోటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌ఎం వలి మాట్లాడారు. జి.వెంకటేశ్వరరావు ఈదర హరిబాబు ఫణి పాల్గొన్నారు.

## సిఐటియు ఆధ్వర్యంలో పాటల శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

సిఐటియు సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో పాటల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళాకారులకు ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జగన్మోహన్‌రావు శిక్షణిచ్చారు. పాట ఒక తూటాలాంటిదని, లక్షలాది మందికి చిన్న పాట ద్వారా పెద్ద సందేశం ఇవ్వొచ్చని అన్నారు. ప్రతి శ్రామికుడూ తన రంగంలో వచ్చే సమస్యలను పాట రూపంలో చెప్పగలినప్పుడు ఎంతో ప్రభావం ఉంటుందని, పాటల ద్వారా ప్రజల సమస్యలను పాలకులకు వినిపించవచ్చుని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ సోమ, మంగళవారాల్లో విజయవాడలో జరిగే మహాధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు.

గాయకులకు శిక్షణ ఇస్తున్న జగన్మోహన్‌రావు